సాక్షి హనుమకొండ

శనివారం | 18 | ఫిబ్రవరి | 2023



తెలుగును పరిరక్షించడం...

తెలుగును పరిరక్షించడం మన అందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ పూర్వ సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. - 8లో▸



'లక్ష్మీపురం' ఆదాయానికి గండి

అధికారుల ఉదాసీనత.. వ్యాపారుల నిర్ల క్ష్యంతో లక్ష్మీపురం మార్కెట్‌లో సుమారు రూ.1.50కోట్ల ఆదాయం కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0^{0} / 21.0^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శుక్రవారం సబ్ జూనియర్స్ బాలబాలికల విభాగంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన పోటీలకు ముఖ్య అతిథిగా జాతీయ ఆర్యవైశ్య సంఘం ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు గట్టు మహేష్‌బాబు హాజరై జెండా ఊపి ప్రారంభించారు. కఠోర సాధన, పట్టుదల, క్రమశిక్షణను అలవర్చుకుంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి కొదిరిపాక సారంగపాణి మాట్లాడుతూ రెండు జిల్లాలకు చెందిన 900 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. విజేతలతోపాటు పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వరంగల్, ములుగు అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షులు మూగల కుమార్‌యాదవ్, లెక్కల రాజిరెడ్డి, రామప్ప ఇనిస్టిట్యూట్ చైర్మన్ ఐలి చంద్రమోహన్‌గౌడ్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, నాగరాజు, పీఈటీ మనోజ్ పాల్గొన్నారు.

నేడు నగరానికి గవర్నర్

సాక్షి ప్రతినిధి, వరంగల్: వరంగల్ నగరంలోని హైగ్రీవాచారి మైదానంలో శనివారం రాత్రి 7.30 గంటలకు ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనున్న మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనంలో రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ పాల్గొననున్నారు. గంటపాటు ఉంటారు. రాత్రి 8.30 గంటలకు హైదరాబాద్‌కు వెళ్తారు. ఓరుగల్లు విశిష్టత, శివరాత్రి వైభవం చాటేలా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ రాకేశ్‌రెడ్డి తెలిపారు.

17మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్, పీజీ కోర్సుల మూడవ సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ వివిధ కేంద్రాల్లో స్క్వాడ్లకు పట్టుబడి 17మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు అధికారులు మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్‌లు తెలిపారు.

చాక్‌పీస్‌పై సూక్ష్మ శివలింగాలు



హన్మకొండ: చాక్‌పీస్‌పై సూక్ష్మ స్థాయిలో శివలింగాలు రూపొందించి సూక్ష్మ కళా ఖండాల రూపకర్త తాటికొండ శ్రీజిత్ మరోసారి తన ప్రతిభను చాటాడు. గోపాల్‌పూర్ అరుణోదయ కాలనీకి చెందిన తాటికొండ శ్రీజిత్ శివరాత్రిని పురస్కరించుకుని చాక్ పీస్‌లతో 5 మిల్లీ మీటర్ల ఎత్తులో 108 శివ లింగాలను తయారు చేశాడు. 108 సూక్ష్మ శివ లింగాల రూపొందించేందుకు 24 గంటల సమయం పట్టిందని శ్రీజిత్ వివరించారు.

ప్రకృతి పరిరక్షణకు హరిత ఉద్యమం

చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్



హన్మకొండ అర్బన్: ప్రకృతి పరిరక్షణకు నడుం కట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హరిత హారం పేరుతో హరితఉద్యమం చేపట్టారని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బాలసముద్రంలోని పార్క్‌లో నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి మొక్కలు నాటారు. పార్క్‌ను కేసీఆర్ పార్క్‌గా నామకరణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

హెల్త్ సిటీగా వరంగల్
రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకుడు శ్రీనివాసరావు

రైతులు ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించాలి

10లో▸

వసూళ్లకు వస్తున్నారు..!



పన్నుల కోసం మళ్లీ స్పెషల్ డ్రైవ్

- 'గ్రేటర్' సహా 9 మున్సిపాలిటీల్లో బకాయిలు
- జీడబ్ల్యూఎంసీలో 54.87 శాతమే వసూళ్లు..
- అన్ని మున్సిపాలిటీల్లో అదే తీరు
- మార్చి నెలాఖరు వరకు గడువు..
- స్పెషల్ డ్రైవ్‌కు మున్సిపల్ అధికారుల సన్నద్ధం

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి జిల్లాలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు మరో తొమ్మిది మున్సిపాలిటీలకు పన్నుల వసూలు భారంగా మారింది. మార్చి నెలాఖరు నాటికి పూర్తిస్థాయి వసూలు లక్ష్యం కాగా.. కొన్ని మున్సిపాలిటీల్లో 50 శాతం కూడా దాటలేదు. మరో 43 రోజుల్లో గడువు పూర్తవుతుండగా.. ఇంటి పన్నుల లక్ష్యసాధన ఎలా అన్న చర్చ మున్సిపల్ ఉద్యోగ వర్గాల్లో మొదలైంది. మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లకుండానే ఇంటినుంచే పన్నులు చెల్లించే అవకాశం గ్రేటర్ వరంగల్ సహా అన్ని పురపాలక సంఘాలకు ప్రభుత్వం కల్పించింది. అయినా సంస్థలకు పన్నుల రూపేణా చేకూరాల్సిన ఆదాయం రావడం లేదు. పన్నుల బకాయిలపై సీరియస్‌గా స్పందించిన పురపాలక శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌కు మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు బకాయిదారులకు నోటీసులు కూడా జారీ చేశారు.

ప్రత్యేక డ్రైవ్‌కు..

గ్రేటర్ వరంగల్ సహా 9 మున్సిపాలిటీల్లో పన్నుల బకాయిలు కోట్లలో పేరుకుపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. గతంలో ఆస్తిపన్ను చెల్లించనివారిపై కొరడా ఝుళిపించిన అధికారులు.. కొంతకాలంగా వేచిచూసే ధోరణిలో ఉన్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా పన్నులు పేరుకుపోయాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.92.78కోట్లు వసూలు లక్ష్యం కాగా.. రూ.50.91కోట్లే(54.87) వసూలు అయ్యాయి. పరకాలలో రూ.298.10లక్షలకు రూ.143.12లక్షలు వసూలు కాగా.. రూ.154.98 లక్షలు వసూలు కావాల్సి ఉంది. జనగామలో రూ.501.30లక్షలకు.. రూ.229.15 లక్షలు, భూపాలపల్లిలో రూ.731.30లక్షలకు.. రూ.258.45లక్షలు.. ఇలా అన్ని మున్సిపాలిటీల్లో బకాయిలు పేరుకుపోయాయి. గతంలోనూ ఇలాగే పన్నుల బకాయిలు పేరుకుపోగా.. వసూలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. మొండి బకాయిదారుల నుంచి వసూలుకు ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేశారు. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న వారిని గుర్తించి రెడ్ నోటీసులు జారీ చేశారు. ఆస్తులు జప్తు చేయడంలోనూ వెనుకాడలేదు. ఈసారి కూడా ఆస్తి, నల్లా పన్నులు బకాయిలు భారీగా పేరుకుపోయిన నేపథ్యంలో మళ్లీ స్పెషల్‌డ్రైవ్ చేయనున్న అధికారులు అన్ని అస్త్రాలను ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు.

మున్సిపాలిటీల వారీగా ఇళ్లు, పన్నుల వివరాలు

జిల్లా	కార్పొరేషన్/ మున్సిపాలిటీ	ఇళ్ల సంఖ్య	పన్నువసూలు డిమాండ్	వసూలు అయినవి	రావాల్సిన పన్ను (రూ.లక్షల్లో..)
గ్రేటర్ వరంగల్		2,05,217	9,278.00	5,091.00	4,187.00
హనుమకొండ	పరకాల	8,951	298.10	143.12	154.98
వరంగల్	నర్సంపేట	11,812	419.16	198.10	221.06
	వర్ధన్నపేట	3,368	59.16	25.21	33.95
మహబూబాబాద్	మహబూబాబాద్	21,557	483.12	271.10	212.02
	డోర్నకల్	3,239	72.15	34.12	38.03
	మరిపెడ	5,846	120.10	55.35	64.75
	తొర్రూరు	6,174	219.01	118.50	100.51
జేఎస్ భూపాలపల్లి	భూపాలపల్లి	12,068	731.30	258.45	472.85
జనగామ	జనగామ	13,997	501.30	229.15	272.15

పన్నుల లక్ష్యం చేధిస్తాం..

కొత్త వెబ్‌సైట్ వల్ల పన్నుల వసూళ్లపై కొంత ప్రభావం పడింది. సాంకేతిక సమస్యలు దాదాపు పరిష్కారమవుతున్నాయి. గడువులోగా ఆస్తి, నీటిపన్నుల లక్ష్యాలను చేధిస్తాం. పన్నుల వసూలు కోసం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తాం.

- అనిసుర్ రషీద్, డిప్యూటీ కమిషనర్

ఆరోగ్య రంగానికి రాష్ట్ర బడ్జెట్లో పెద్దపీట

హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు

ధర్మసాగర్: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ధర్మసాగర్ మండలంలోని కరుణాపురం గ్రామ కొలంబో లెప్రసి కాలనీని, మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డైరెక్టర్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు సందర్శించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు రాష్ట్ర బడ్జెట్లో ఎన్నడూ లేని విధంగా ఆరోగ్య రంగానికి పెద్దపీట వేశారన్నారు. అధిక నిధులను కేటాయించడం దూర దృష్టికి నిదర్శనమన్నారు. అన్ని జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని మరోసారి ఏర్పాటు చేసి 18 సంవత్సరాలు పైబడిన వారందరికి కంటిపరీక్షలు చేయిస్తూ అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ఆయురారోగ్యాలతో ఉండి రాష్ట్రానికి మరిన్ని సేవలందించాలని ఆయన కోరారు. అనంతరం ఆస్పత్రిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓలు సాంబశివరావు, వెంకటరమణ, జెడ్పీటీసీ పిట్టల శ్రీలత, అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్ రావు, పీడీ డీటీటీ డాక్టర్ లలితదేవి, డిప్యూటి డీఎంహెచ్‌ఓ యాకుబ్‌పాషా, సర్పంచ్‌లు ఎర్రబెల్లి శరత్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కేసు విచారణ త్వరగా జరగాలి

పరకాల: నడిరోడ్డుపై న్యాయవాది వామన్‌రావు దంపతులను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పరకాల బార్ అసోసియేషన్ మేరుగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రెండేళ్ల క్రితం వామన్‌రావు దంపతులను హత్యకు పాల్పడిన నిందితులకు కఠినమైన శిక్ష విధించకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర బార్ అసోసియేషన్ పిలుపుమేరకు శుక్రవారం పరకాల కోర్టు ముందు న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కేసు విచారణ త్వరగా జరపాలన్నారు. నేర అభియోగాలను ఎదుర్కొంటున్న వ్యక్తుల పేర్లను చార్జ్‌షీట్లలో చేర్చాలన్నారు. అప్పుడే ప్రజలకు చట్టం పట్ల నమ్మకం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఓంటేరు రాజమౌళి, వి.చంద్రమౌళి, గంద్ర నరేష్‌రెడ్డి, తోట పరమేశ్వర్, జే.కార్తీక్, శంకర్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పరకాల న్యాయవాదులు

భూ పోరాటం పాటల చిత్రీకరణ

ఎల్కతుర్తి: మండలంలోని సూరారం గ్రామ శివారులో గల 566 సర్వేనంబర్‌లో నిరుపేదలు వేసుకున్న గుడిసెవాసుల స్థలాల్లో శుక్రవారం ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు రాజనర్సు ఆధ్వర్యంలో బాద నర్సయ్య పాటలు చిత్రీకరించారు. రాజనర్సు మాట్లాడుతూ నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ చేపట్టిన భూపోరాటం నేటికి 90రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా సహాయ కార్యదర్శి శ్యామ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రె లక్ష్మణ్, మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, నాయకులు శ్రీనివాస్, మొండయ్య, నిమ్మల మనోహర్, చంద్రమౌళి, తిరుమల, లలిత, మొగిళి, కొమురయ్య, విజయ పాల్గొన్నారు.



పాట చిత్రీకరిస్తున్న ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు నర్సయ్య

వారంలో రిజల్ట్ కనిపించాలి

- వారంలో రిజల్ట్ కనిపించాలి
- మన ఊరు – మన బడి పనుల్లో వేగం పెంచాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశం
- రెండు మండలాల్లో పనులపై అసంతృప్తి



మన ఊరు మనబడి సమీక్షలో కలెక్టర్, డీఆర్‌డీఓ

హన్మకొండ అర్బన్: మన ఊరు– మనబడి, మన బస్తీ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులు, నిర్దేశిత లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మన ఊరు – మన బడి కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమదేవరపల్లి, ఆత్మకూరు మండలాల్లో ఈజీఎస్ పనులు జీరోస్థాయిలో ఉన్నాయని, అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే వారంలో మళ్లీ నిర్వహించే సమావేశం నాటికి పనితీరులో మార్పు, ప్రగతి కనిపించాలన్నారు. ఏఈ, డీఈ, ఈఈ, స్పెషల్ ఈఫీసర్లు, ఎంపీడీఓ, ఎంపీఓలు క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈజీఎస్ పథకం కింద ఖర్చు చేసిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. బడుల రూపురేఖలు మార్చడానికి, మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించడానికి ముఖ్యమంత్రి ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి లక్ష్యాలు సాధించాలని అన్నారు. సమావేశంలో డీఈఓ అబ్దుల్‌హై, డీఆర్‌డీఓ శ్రీనివాస్, సీపీఓ సత్యనారాయణ, డీపీఓ జగదీష్, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

ఆడపిల్లలను చదివించాలి



పురస్కారాలు అందుకున్న విద్యార్థినులతో డీఈఓ వాసంతి, జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్

వరంగల్ డీఈఓ వాసంతి

హన్మకొండ: తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని వరంగల్ డీఈఓ వాసంతి అన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ గ్రామీణ బాలికల ప్రతిభా పురస్కార అవార్డుల కార్యక్రమం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం జరిగింది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణులై 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిభా పురస్కార అవార్డులను ఆ సంస్థ అందించింది. ప్రతి జిల్లా నుంచి వంద మంది విద్యార్థినులను ఎంపిక చేసి పురస్కారాలు అందించారు. వరంగల్ డీఈఓ వాసంతి, వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ బాలిక విద్యను ప్రోత్సహించడం మంచి పరిణామమన్నారు. కంపెనీ సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పి.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3,500 అందించామన్నారు. కార్యక్రమంలో కంపెనీ సీనియర్ జోనల్ మేనేజర్ సజన్‌కుమార్, భరత్, సుదర్శన్‌రెడ్డి, రాంప్రసాద్, సుమన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరేష్ శర్మ, అనిల్ రెడ్డి, రాహుల్, వాసు, వెంకన్న పాల్గొన్నారు.

వ్యాపార లైసెన్సులు కలిగి ఉండాల్సిందే!

- 28 వరకు సవరణలకు గడువు

వరంగల్ అర్బన్: మహా నగరంలోని ప్రతి దుకాణదారుడు వ్యాపార లైసెన్స్ (ట్రేడ్ లైసెన్స్)కలిగి ఉండాల్సిందేనని గ్రేటర్ వరంగల్ కమిషనర్ ప్రావీణ్య సూచించారు. లేనిపక్షంలో మార్చి 1 నుంచి షాపులను సీజ్ చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం కొద్ది రోజులుగా నగరంలోని షాపుల వ్యాపార లైసెన్స్ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజారోగ్య సిబ్బంది షాపులు ఎంత విస్తీర్ణంలో ఉందని కొలతలు వేసిన బల్దియాకు చెందిన www.gwmc.gov.in వైబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారని వివరించారు. అందులో ఏమైనా లోపాలు ఉంటే ఈ నెల 28వ తేదీలోగా సవరణలు చేసుకోవాలని సూచించారు.

ఓటేయాలని.. ఒట్టు తీసుకుని..

- సబ్బండ వర్గాలను పలకరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..
- జనగామ జిల్లాలో సాగిన టీపీసీసీ చీఫ్ రేవంత్ పాదయాత్ర
- బహిరంగ సభలో ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ కడియంపై పొగడ్తలు.. విమర్శలు

జఫర్‌గఢ్/స్టేషన్‌ఘన్‌పూర్/జనగామ: అభిమానులు తరలిరాగా.. అడుగులో అడుగు వేస్తూ.. ఊరి ప్రజలతో మమేకమవుతూ.. పొలాల వద్ద రైతులు.. కూలీలను ఆప్యాయంగా పలకరిస్తూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ×హాథ్ సే హాథ్×జోడో పాదయాత్ర ఉత్సాహంగా ముందుకు సాగింది. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూరు క్యాంపు వద్ద బస చేసిన రేవంత్‌రెడ్డిని.. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం గజమాలతో స్వాగతం పలికారు. ఉదయం 10.30 గంటలకు కూనూరు నుంచి మొదలైన పాదయాత్ర.. ఉప్పుగల్, పాంనూర్, శివునిపల్లి మీదుగా స్టేషన్‌ఘన్‌పూర్ శివాజీ చౌక్ వరకు సాగింది. రహదారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ.. వారు చెప్పిన సమస్యలు ఓపికతో విన్నారు. విన్నపాలు స్వీకరిస్తూ తల్లీ.. ఈ కాగితం నా దగ్గరే ఉంటుంది.. మన ప్రభుత్వం రాగానే పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చారు. ఉప్పుగల్ శివారులో ఆటోలో వెళ్తున్న ఓ వృద్ధురాలితో రేవత్‌రెడ్డి మాట్లాడారు. అమ్మా.. బంగారు తెలంగాణలో నీ మెడలో బంగారమే లేకపాయే.. రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు మనకు ఇళ్లొచ్చినయ్.. అంటూ కాంగ్రెస్‌కే ఓటు వేయాలని ఒట్టు తీసుకున్నాడు.

ఆశీర్వాదం తీసుకున్న నవ దంపతులు

పాదయాత్ర స్టేషన్‌ఘన్‌పూర్‌కు చేరుకున్న సమయంలో పెళ్లిచేసుకుని ఇంటికి వస్తున్న విద్యాసాగర్, శ్రావణి నవదంపతులు రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు.

రాజయ్య, కడియంలను పొడిగి.. టార్గెట్ చేసి

స్టేషన్ ఘన్‌పూర్ బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి.. స్థానిక ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని పొగిడినట్టే పొగుడుతూ.. టార్గెట్ చేశారు. ఇద్దరు ఉప ముఖ్యమంత్రులుగా పని చేసి వందపడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల తెచ్చుకోలేదన్నారు. రాజయ్య, కడియం ఒకరినొకరు కొట్టుకునేలా చేసి.. కేసీఆర్ సినిమా చూపిస్తున్నాడని అన్నారు. రాజకీయ భిక్షపెట్టిన కాంగ్రెస్‌కు ద్రోహం చేసిన రాజయ్యకు బీఆర్‌ఎస్‌లో పరాభవమే దక్కిందని, దొరగారి దొడ్లో బతకాలంటే.. గాడిదకంటే హీనంగా చూస్తారంటూ చురకలు వేశారు. టీడీపీలో ఉన్నప్పుడు ఆత్మగౌరవంతో పని చేసిన కడియం శ్రీహరి.. ఇప్పుడు కేసీఆర్ దొరల పాలనలో అవన్నీ వదిలి పెట్టినట్టు కనిపిస్తున్నదని విమర్శించారు.



స్టేషన్‌ఘన్‌పూర్ బహిరంగ సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన షబ్బీర్ అలీ, ఇందిర తదితరులు

ఉదయం 10.40-10.55 గంటలు..



తమ సమస్యలు చెప్పుకుంటున్న కూనూరు ప్రజలు

పాదయాత్ర సందర్భంగా రేవంత్‌రెడ్డిని కూనూర్‌కు చెందిన రైతు శిరబోయిన శ్రీనివాస్, మరికొందరు రైతులు కలిశారు. ఉప్పుగల్లు రిజర్వాయర్ వద్ద గేట్‌వాల్వు ఏర్పాటు చేసి, ఉప్పుగల్లు, కూనూర్, తమ్మడపల్లి(ఐ), కోనాయిచలం, తిడుగు, గర్మిళపల్లి గ్రామాల మీదుగా ఉన్న ఆకేరు వాగులోకి నీరు విడుదల చేసేలా చూడాలని విన్నవించారు. అధికారంలోకి రాగానే గేట్‌వాల్వ్ బిగించి నీళ్లు వచ్చేలా చేస్తామని రేవంత్ చెప్పారు. కూనూరు పెద్దమ్మ గుడి వద్ద ముదిరాజ్‌లు రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు.

11.20 - 11.45 గంటలకు



బైరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రేవంత్

ఉప్పుగల్లులో రోడ్డుపక్కన ఉన్న బైరి శ్రీనివాస్ ఇంటికి వెళ్లిన రేవంత్‌రెడ్డి.. కుటుంబ సభ్యులను పలకరించాడు. అధికారంలోకి వస్తే.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వివరించారు. తమ గ్రామానికి బస్సు రావడం లేదని అక్కడే ఉన్న మహిళలు పీసీసీ చీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామపంచాయతీ వద్ద జీపీ సిబ్బంది రేవంత్‌ను కలిసి సమస్యలు ఏకరువు పెట్టారు. నెలకు రూ.8,500 వేతనం సరిపోవడం లేదని చెప్పగా.. మన ప్రభుత్వం వచ్చాక గొప్పగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత రోడ్డుపక్కనే ఉన్న ఆటో డ్రైవర్లను రేవంత్‌రెడ్డి పలకరించారు.

మధ్యాహ్నం 12.30 గంటలకు..

ఉప్పుగల్లులో ఓ గౌడన్న పొద్దాడు కల్లు తీసుకుని ఇంటికి వెళ్తుంటే.. ఆపిన రేవంత్‌రెడ్డి లొట్టి చేతికి తీసుకుని ధర ఎంతనే.. లాభం ఉంటుందా అంటూ అడిగారు. గ్రామ శివారులో రైతు కావటి రాజయ్య మొక్కజొన్న కొయ్యకాళ్లను కాడెద్దులతో దున్నుతుండగా.. రేవంత్ వెళ్లి నాగలి చేతిలోకి తీసుకుని.. కొద్దిదూరం దున్నాడు. తాతా.. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే ఒకేసారి రూ.2లక్షల బ్యాంకు రుణం మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సీతక్క, పార్టీ సీనియర్ నాయకులు మల్లు రవి, షబ్బీర్ అలీ, జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర, నాయకులు గంగారపు అమృతరావు, దొమ్మాటి సాంబయ్య, చేపూరి వినోద్, అన్నెబోయిన భిక్షపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, సీహెచ్.కృష్ణమూర్తి, సదయ్యగౌడ్, నూకల ఐలయ్య, తాటికాల రాజేందర్ తదితర నాయకులతో కలిసి స్టేషన్ ఘన్‌పూర్‌కు చేరుకున్నారు.



గీతకార్మికుడిని కలిసి కల్లు గురించి అడుగుతున్న రేవంత్

25, 26 తేదీల్లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 25, 26 తేదీల్లో 8వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కొదిరిపాక సారంగపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14, 16, 18, 20 బాలబాలికలు, మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 19న హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్ -14, 16, 20 విభాగాల క్రీడాకారులకు కేవలం 400ల మీటర్ల పరుగు పందెం, అండర్-18 కేటగిరీలో 100, 200, 400, 800, 1500, 3000, 5000, 10,000, 20,000 స్టిపుల్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్, పోల్‌వాల్ట్ ఈవెంట్లలో ఎంపికలు ఉంటాయని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 19న ఉదయం 9గంటలకు జేఎన్ఎస్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. క్రీడాకారులు తమవెంట ఆధార్, జనన ధ్రువీకరణ, పదోతరగతి ఒరిజినల్ మెమోతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 93910 29491, 93901 04499 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బంగారు గొలుసు లాక్కెళ్లిన దొంగ

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి ఎక్సైజ్ కాలనీలోని భరోసా కేంద్రానికి విధులకు వస్తున్న హెల్త్ వర్కర్ పోలేపాక పవిత్ర మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని దొంగ అపహరించుకుపోయారు. శుక్రవారం హసన్‌పర్తి మండలం, పెగడపల్లికి చెందిన పవిత్ర విధులకు వస్తుండగా.. స్కూటీపై వచ్చిన గుర్తు తెలియని దొంగ గొలుసును లాక్కెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. గొలుసు విలువ రూ. 20 వేలు ఉంటుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు.

'లక్ష్మీపురం' ఆదాయానికి గండి

- మార్కెట్లో అద్దె వసూళ్లపై అధికారుల నిర్లక్ష్యం
- కవర్‌షెడ్, ఓపెన్ ప్లాట్లను పట్టించుకోని అధికారులు
- అస్తవ్యస్తంగా కూరగాయల మార్కెట్
- అడ్రస్ లేని అగ్రిమెంట్ ప్రక్రియ



వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్



వాహనాల పార్కింగ్, రైతులు, వ్యాపారులు నిద్రించేందుకు ఆవాసంగా కవర్ షెడ్

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌ను ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించింది. అధికారుల ఉదాసీనత కారణంగా వ్యాపారుల నిర్లక్ష్యంతో ఈఏడాది సుమారు రూ.1.50 కోట్ల ఆదాయం మార్కెటింగ్ శాఖ కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. మోడల్ మార్కెట్‌లో 95 కమిషన్ లైసెన్స్‌దారులకు 82 మడిగెలు, చిల్లర వ్యాపారులకు కవర్ షెడ్‌లో 158 ప్లాట్లు, బహిరంగంగా మరో 230 ప్లాట్లను అధికారులు చోటామోటా వ్యాపారులకు అప్పగించారు. ఇవి కాకుండా అనధికారికంగా మరో 200 మంది వరకు మార్కెట్ లోపల, బయట వ్యాపారాలు చేస్తున్నారు. వీటికి తోడు బయట కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించి టెండర్లు నిర్వహించి 30 మంది వ్యాపారులకు అప్పగించారు. వ్యాపారులకు అప్పగించిన అధికారులు అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి చేయకపోవడం, కమర్షియల్ కాంప్లెక్స్‌లో అద్దె వసూళ్లలో ప్రతిబంధకాలతో ఈఏడాది పెద్ద మొత్తంలో మార్కెట్ ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది.

పూర్తికాని అగ్రిమెంట్..

కూరగాయల మార్కెట్‌లోని 95 మంది కమీషన్ వ్యాపారుల్లో 82 మందికి మడిగెలు కేటాయించారు. ఇందులో 20 మడిగెల్లోని వ్యాపారులతో నేటికీ అగ్రిమెంట్ ప్రక్రియ చేయించలేకపోయారు. కమీషన్ వ్యాపారులు తాము పొందిన మడిగెల్లో వ్యాపారం చేసుకుంటున్నా.. మార్కెట్ అధికారులు మిన్నకుండి పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అగ్రిమెంట్ లేకుండా తక్‌పట్టీలు రాయకుండా ఎలా కమీషన్ వ్యాపారులుగా చెలామణీ అవుతున్నారో మార్కెట్ అధికారులకే తెలియాలి.

కవర్‌షెడ్‌పై నిర్లక్ష్యం..

మార్కెట్‌లో ఓపెన్ ప్లాట్లు కేటాయించడంతో కొనుగోలుదారులు లోపలకు రావడం లేదని కవర్‌షెడ్‌లోని 158 మంది చిల్లర వ్యాపారులు పలుమార్లు అధికారులకు మొర పెట్టుకున్నారు. ఓపెన్ ప్లాట్లలో గిరాకీ ఉన్నందున కవర్‌షెడ్ ఖాళీగా మారడంతో పార్కింగ్‌గా మారింది. ఈప్లాట్లకు అద్దె ఎక్కువగా ఉన్నందున తగ్గించి అగ్రిమెంట్ చేయాలని వ్యాపారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈవిషయాన్ని మార్కెట్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఏడాదిగా ఎలాంటి అద్దె వసూలు చేయని పరిస్థితులు నెలకొన్నాయి.

కమర్షియల్ లాస్..

మోడల్ మార్కెట్‌కు అనుసంధానంగా నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్ అద్దెలు వసూలు కాకపోవడంతో మార్కెట్‌కు పెద్ద మొత్తంలో నష్టం వచ్చింది. 30 షాపులకు టెండర్లు నిర్వహించి ఒక్కొక్కరి వద్ద 3 నెలల అద్దెలను అడ్వాన్సుగా తీసుకుని అప్పగించారు. ఈకాంప్లెక్స్‌లో ప్రతీ నెల రూ.6.25లక్షలు వసూలు కావాల్సి ఉంది. అద్దెలు ఎక్కువగా ఉన్నాయని అగ్రిమెంట్ చేసుకున్న వారిలో చాలా మంది వదిలేశారు. అగ్రిమెంట్‌లో ఉన్న నిబంధనలు పరిగణనలోకి తీసుకొని 2, 3 నెలలు చూసి వెంటనే ఈషటర్లకు రీ టెండర్లను నిర్వహిస్తే మార్కెట్‌కు ఆదాయం వచ్చేది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లుగా ఇప్పుడు అద్దెలు చెల్లించని, కోర్టు కేసుల్లో ఉన్న వాటిని మినహాయించుకుని మిగిలిన 18 షట్టర్లకు ఈనెల 22న టెండర్లు నిర్వహిస్తున్నట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

మార్కెట్‌కు నష్టమెంతంటే..

- కమీషన్ వ్యాపారులకు అప్పగించిన మడిగెల నుంచి ప్రతి నెలా సుమారు రూ.3 లక్షలు అద్దెల రూపంలో రావాల్సి ఉంది. ఇందులో అగ్రిమెంటు, తకపట్టీలు లేక సుమారు రూ.20 లక్షల వరకు ఆదాయం మార్కెట్‌కు దక్కడంలేదు.
- ఓపెన్ ప్లాట్లు వివిధ సైజులు 230 ప్లాట్లు అధికారికంగా కేటాయించారు. ఒక్కోదానికి కనీసం రూ.800 చొప్పున అనుకున్నా.. ఏడాదికి(12)నెలలకు రూ.22,08,000లు ఆదాయం కోల్పోయినట్లు.
- కూరగాయల మార్కెట్‌లోని కవర్ షెడ్‌లో 158 మంది చిల్లర వ్యాపారులకు కేటాయించారు. నిర్ణయించిన ప్రకారం అద్దె రూ.2,300 చొప్పున 12 నెలలకు రూ.43,60,800లు ఆదాయం కోల్పోయినట్లు.
- కమర్షియల్ కాంప్లెక్స్‌లో 30 షటర్లకు నెలకు రూ.6,25,000లు వసూలు కావాల్సి ఉంది. ఏడాదికి రూ.75 లక్షల ఆదాయం మార్కెట్‌కు రావాల్సి ఉంది. ఎందరు కట్టారు? ఎవరు కోర్టుకు వెళ్లారు? అద్దెలు కట్టకున్నా.. ఏడాది వరకు ఎందుకు నిరీక్షించారు? అనే విషయాలు అధికారులకే తెలియాల్సి ఉంది.

బిడ్డపై అఘాయిత్యం చేసిన తండ్రి అరెస్ట్

ఖిలా వరంగల్: కూతురును బెదిరించి అత్యాచారం చేసిన కన్నతండ్రిని పోక్సో కేసులో శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. వరంగల్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌తో కలిసి ఏసీపీ కేసు వివరాలు వెల్లడించారు. ఉర్సు కరీమాబాద్‌కు చెందిన ఓ తండ్రి బీరువాల దుకాణంలో పని చేస్తుండగా, అతడి భార్య బట్టల షాపులో పని చేస్తోంది. వీరి కుమార్తె నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. గతేడాది ఆగస్టులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో ఉన్న తండ్రి. తన 16 ఏళ్ల కుమార్తెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈవిషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. అనంతరం బాలిక ఒంటరిగా ఉన్న పలు సమయాల్లో లైంగికంగా లోబర్చుకున్నాడు. బాలిక గత నెల అనారోగ్యానికి గురైంది. ఆబాలికను తల్లి సీకేఎం ఆస్పత్రిలో వైద్యులకు చూపించగా 17 వారాల గర్భవతి అని వైద్యులు చెప్పారు. వైద్యుల సూచనల మేరకు లాయర్ ఆఫిడవిట్ తీసుకెళ్లగా.. ఈనెల 9న అబార్షన్ చేశారు. ఆతర్వాత ఆబాలికను నేరుగా మేనమామ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ జరిగిన విషయాన్ని బాలిక మేనమామకు వివరించింది. గుట్టుగా ఉన్న విషయాన్ని ఈనెల 14న బాలిక తల్లి, మేనమామ ఇద్దరి సహకారంతో బాధిత బాలిక తన తండ్రిపై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కామాంధుడైన ఆబాలిక తండ్రిని శుక్రవారం ఉదయం కరీమాబాద్‌లో అరెస్ట్ చేశారు. అనంతరం నిందితున్ని కోర్టులో హాజరు పర్చగా జడ్జి ఆదేశాల మేరకు ఖమ్మం జైలుకు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

తెలుగును పరిరక్షించడం మన బాధ్యత

- ఏపీ శాసనమండలి పూర్వ సభాపతి మండలి బుద్ధ ప్రసాద్
- విశ్రాంత ఐఏఎస్ విజయభాస్కర్‌కు కవితాప్రసాద్ పురస్కారం



మాట్లాడుతున్న ఏపీ పూర్వ శాసనసభాపతి మండలి బుద్ధప్రసాద్

విద్యారణ్యపురి: తెలుగును పరిరక్షించడం మన అందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ పూర్వ సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ రజతోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమకొండలోని సామ జగన్మోహన్‌రెడ్డి స్మారక భవనంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కవితా ప్రసాద్ సేవలను కొనియాడారు. కవితాప్రసాద్ కవిత్వ తత్వాన్ని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య విశ్లేషించారు. తుమ్మూరి లక్ష్మణరావు కవితా ప్రసాద్ కావ్యాల్లోని పద్యాలు వినిపించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ధీర్ఘాషి విజయభాస్కర్‌కు కవితాప్రసాద్ పురస్కారాన్ని అందించి సత్కరించారు. రామశాస్త్రి, వెంకటయ్య, జనార్దన్‌ను సత్కరించారు. ఆ సంస్థ బాధ్యులు గిరిజామనోహర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సంస్థ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎన్‌వీఎన్ చారి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, బీఎంరెడ్డి, భాస్కర్, పొట్లపల్లి, విద్యార్థి, మురళీధర్ సాహితీవేత్తలు, ఆసంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

20, 21న ప్రత్యేక మెడికల్ క్యాంపు

కాళోజీ సెంటర్: దృష్టి లోపం ఉన్న ఉపాధ్యాయులకు ఈనెల 20, 21 తేదీల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు డీఈఓ డి.వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత వీహెచ్ ఉపాధ్యాయులు నూతన, రెన్యూవల్ సర్టిఫికెట్ల కోసం మీ సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్ శనివారం నుంచి అందుబాటులోకి రానుందని, వీహెచ్ ఉపాధ్యాయులు క్యాంపునకు వెళ్లి సర్టిఫికెట్లు పొందాలని తెలిపారు. స్లాట్ బుకింగ్ కోసం ఐడీ కార్డు, ఎంప్లాయి ఐడీ కార్డు తీసుకెళ్లాలని సూచించారు.

సంస్కారం మరిచి మాట్లాడుతున్నారు

- ఉనికి కోసం రేవంత్‌రెడ్డి, షర్మిల పాదయాత్రలు
- రేవంత్, షర్మిలపై మంత్రి ఎర్రబెల్లి ఫైర్



సింగరాజుపల్లిలో కేసీఆర్ జన్మదిన వేడుకల్లో మంత్రి ఎర్రబెల్లి, కలెక్టర్ శివలింగయ్య

జనగామ/దేవరుప్పుల: బీఆర్ఎస్‌పై, సీఎం కేసీఆర్‌పై, నాయకులపై రేవంత్‌రెడ్డి, షర్మిల కనీస సంస్కారం మరిచి పచ్చిగా మాట్లాడుతున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అదేవిధంగా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో ఉచిత కుట్టుమిషన్ కేంద్రం వద్ద మహిళల మధ్య సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా జిల్లా కలెక్టర్ శివలింగయ్యతో కలిసి మంత్రి కేక్ కట్ చేశారు. అనంతరం కామారెడ్డిగూడెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మొక్కలు నాటారు. దేవరుప్పుల చౌరస్తాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ అధ్యక్షతన కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి ఆయా చోట్ల మాట్లాడుతూ.. ఆర్టీఏ పేరిట బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో పబ్బం గడుపుకునే రేవంత్‌రెడ్డి, కబ్జాలు, గుండాగిరి తదితర కేసుల్లో పాతుకుపోయిన జంగా రాఘవరెడ్డి తనపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల వచ్చిన తర్వాత, పాలకుర్తిలో హాస్పిటల్ అని మొరుగుతున్నారన్నారు. రాయపర్తి సమీపం మహబూబ్‌నగర్‌కు చెందిన ముస్లింల భూములు ఎవరి పేరిట ఉన్నాయో తెలుసుకుని మాట్లాడితే మంచిదన్నారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని షర్మిల కూడా మాట్లాడడం శోచనీయమన్నారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలనే సంకల్పంతో.. గత పాలకులు వదిలేసిన పనులను సీఎం కేసీఆర్ మొదలు పెట్టారన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ కార్యాలయ సమన్వయకర్త డాక్టర్ సుల్తాన్‌రాజా, దేవరుప్పుల మండల అధ్యక్ష, కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేశం, పల్ల సుందర్‌రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్‌హాక్ పద్ధతిన పోస్టింగ్‌లు ఇవ్వాలి

కాళోజీ సెంటర్: కోర్టు స్టే ద్వారా నిలిపివేసిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ప్రస్తుతం పదోన్నతులు చేపట్టి అడ్‌హాక్ పద్ధతిలో పోస్టింగ్‌లు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి బద్దం వెంకటరెడ్డి ప్రభుత్వానికి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పదోన్నతులు లేకపోవడం వల్ల సగటున ప్రతీ పాఠశాలలో రెండు ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు, అనేక పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే భాషా పండిట్‌లు, పీఈటీల విషయంలో న్యాయ వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించించి వెంటనే పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం చేపట్టాలని కోరారు.

పుట్టిన రోజు వేడుకలకు వెళ్లొస్తూ..


- లారీ ఢీకొని ఇద్దరు యువకుల మృతి
- ఎంజీఎంలో మరో యువకుడికి చికిత్స




మృతులు భరద్వాజ్, లోకేశ్

కాజీపేట: స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లొస్తూ ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదానికి బలయ్యారు. కాజీపేట-ప్రగతినగర్ కాలనీ ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన తుసం భరద్వాజ్(20), లోకేశ్(21) మృతి చెందారు. అజయ్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్న భరద్వాజ్, లోకేశ్, అజయ్ గురువారం అర్ధరాత్రి నగరంలోని తమ స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యారు. తిరిగి ఒకే బైక్‌పై కాజీపేట వైపు వస్తుండగా.. నిట్ సమీపంలో వీరి బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో భరద్వాజ్ అక్కడికక్కడే మృతి చెందగా.. లోకేశ్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. తీవ్ర గాయాలతో అజయ్ చికిత్స పొందుతున్నాడు. మృతుడు భరద్వాజ్ తండ్రి శైలేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. కాగా.. ఎంజీఎం పోస్టుమార్టమ్ కేంద్రానికి దక్షిణ మండలం డీసీపీ ఎంఏ బారి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. బంధు, మిత్రులతో ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వరకు పిల్లలు బయట తిరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కన్నవాళ్లపైనే ఉందన్నారు.

స్నేహితులను కలిసేందుకు వచ్చి..



సాయికుమార్(ఫైల్)

నడికూడ: మండలంలోని కొకొండ గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హుజూరాబాద్ మండలం ఇప్పల్ నర్సింగాపురం గ్రామానికి చెందిన గాజ సాయికుమార్(22) మృతి చెందాడు. సాయి వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం స్నేహితులు భారత్ రెడ్డి, శివతో కలిసి భారత్‌రెడ్డి బైక్‌పై మండలంలోని కొకొండ గ్రామంలో ఉన్న స్నేహితులను కలిసేందుకు వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో గ్రామ కమాన్ మూలమలపు వద్ద బైక్ అదుపు తప్పి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని చికిత్స కోసం పరకాలలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయి మృతి చెందాడు. మృతుడి తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దామెర ఎస్సై అనిల్ తెలిపారు.

నిట్‌లో 'క్యూరా-23'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిట్ డైరెక్టర్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని స్కూల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో 'క్యూరా-23' వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు, బెంగళూరు ఐఐఎం డైరెక్టర్ రిషికేష్ కృష్ణన్‌లు రామన్ సెమినార్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి సారించాలని రమణారావు కోరారు. బెంగళూరు ఐఐఎం డైరెక్టర్ రిషికేష్ కృష్ణన్ మాట్లాడుతూ.. మెషిన్ లెర్నింగ్, ఐఓటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లలో ఇంజనీరింగ్ విద్యతో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ పులి రవికుమార్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హెడ్ రమాదేవి, ఫ్యాకల్టీ అడ్వయిజర్ గోపాల్, స్టూడెంట్ కోఆర్డినేటర్ తేజస్విని, తదితరులు పాల్గొన్నారు. క్యూరా-23లో భాగంగా విద్యార్థులకు హౌజ్ ఆఫ్ రీసోర్స్, మైండ్ ఫెస్ట్, పిచ్ ఫర్ఫెక్ట్ పోటీలు నిర్వహించారు. వేడుకలు రెండు రోజులపాటు జరగనున్నాయి.